కథ




# ఉషఃకాలం

—సుజాతారావ్ వేముగంటి

చినుకు చిన్నదే కానీ...ఎడతెగకుండా పడుతూ, ఈ జగమంతా వర్షమయం అన్న భ్రమ కలిగిస్తుంది. గాఢాంధకారంలో, ఉరుములతో, చీకటిని చీల్చే మెరుపులతో ఎంత సమయం గడిచిందో ఊహకు అందకుండా వుంది.

అదొక చిన్న రైల్వే స్టేషన్. స్టేషన్ అంటే పాడ వాటి హాలు. ఆ హాలుకు కుడిపక్క చిన్న గది. హాలులో నేలమీద పశువులు పడుకుని విశ్రాంతగా నెమరు వేసుకుంటున్నాయి. హాలులో ఎడమ వైపు వున్న సిమెంట్ బెంచిపై కొన్ని కుక్కలు వాలుక పాచి దిక్కులు చూస్తున్నాయి. ఛోటా స్టేషన్లు రాయితీ అయిన విశ్రాంతి మందిరాలు కాబోలు. ఆ స్టేషన్ స్వేచ్ఛా జీవులకి విశ్రాంతి మందిరమై పోయినట్టుగా వుంది. ఆ స్టేషన్‌లో ట్రెయిన్ వచ్చి పోయే ఆ కొద్ది నిమిషాలు ఎంతో సందడిగా వుంటుంది. ఆ తర్వాత నిశ్శబ్దంగా, నిర్మానుష్యమైపోతుంది. ప్లాట్‌ఫారంపై అప్పుడే ఆగిన పాసింజర్ రైల్లో నుంచి ముప్పై ఏళ్ళ రాఘవ దిగాడు. రైలు దిగగానే ఒక్కసారిగా చలి గాలి రివ్వున అతడి వొంటిని తాకి ఉక్కిరి బిక్కిరి చేసింది. స్టేషన్ బయటకు వచ్చి ఊరి వైపు నడక సాగించాడు. షర్ట్ జేబులోంచి 'గోల్డ్‌ఫ్లేక్' తీసి వెలిగించాడు. గాలీ..చినుకులూ కలగలిసి వీస్తుండటంతో అగ్గిపుల్ల గప్పున ఆరిపోయింది. ఎంత ప్రయత్నించినా సిగరెట్ అంటించ లేక పోయాడు. 'షిట్! కనీసం సిగరెట్ తాగే అవకాశం కూడా లేకుండా పోయింది' అసహనంగా అనుకుంటూ నడుస్తున్నాడు రాఘవ. రహదారి అంచుల పొడవునా...ముసుగు రాక్షసుల్లా చీకట్లో కనపడుతున్న చెట్ల కొమ్మల నుంచి నీటి బిందువులు టప్ టప్ మని శబ్దం చేస్తూ, ఆకులపై పడి రాలిపోతున్నాయి.

రాఘువ నడిచే దారంతా దాదాపు అంధకారమై పోయింది. ఆ చిమ్మ చీకటిలో ఏదీ వినపడ టమే కాని కనపడటం లేదు. దూరంగా నక్కల ఊళలు... కుక్కల మొరుగుళ్ళు...విచిత్రమైన ధ్వనులు...విపరీతమైన చీకటి తెరలు కలగలిసి రాఘువ స్మృతిలో ఈ ప్రయాణానికి దారి తీసిన జ్ఞాపకాల్ని లేపుతున్నాయి.

*** *** ***

'ఎటు చూసినా నీళ్ళే. కానీ తాగడానికి ఒక్క చుక్క కూడా లేవు' అనుకున్నాడట సము ద్రంలో పయనిస్తున్న నావికుడెవరో. రాఘువ ఉద్యోగం విషయంలో అదే జరిగింది. ఎక్కడ చూసినా...ఎటు చూసినా ఉద్యోగాలు ఖాళీలు వున్నట్టే వుంటాయి. చేయదలచుకుంటే అంత త్వరగా అవకాశం రాకపోవడం...ఇలా రెండే ళ్ళలో విసుగెత్తి పోయి హైదరాబాద్ వచ్చాడు రాఘువ... కన్న తల్లినీ, కన్న వూరునీ వది లేసి వుద్యోగం కోసం. ఒక పత్రికాఫీసులో జర్నలిస్టుగా సామాన్యమైన జీతానికి చేరిన రాఘువ, ఎన్నోమార్లు ఆ పల్లెటూరు నుంచి అమ్మను తీసుకు రావడానికి ఎన్నో ప్రయ త్నాలు చేశాడు. అమ్మంటే రాఘువకు ఎంతో ఇష్టం. ఆ మాటకొస్తే ఇష్టం కానిది ఎవరికి అని? రాఘువ రెండేళ్ళ వయసులో వున్నప్పుడు అతడిని 'అమ్మ' చేతిలో పెట్టి పైలోకాలకు వెళ్ళిపోయాడు రాఘువా వాళ్ళ నాన్న. ఓ చీకటి రాత్రి పాము కాటుకు గురయ్యాడన్నారంతా. ఉన్న ఎకరం పొలం సాగు చేసుకుంటూ, పళ్ళ బిగువున కష్టాన్ని నొక్కి పెట్టి, పెదవుల మీద చిరునవ్వుతో రాఘువను పెంచింది అమ్మ. డిగ్రీ అయిపోయాక ఉద్యోగంలో చేరదల్చుకున్నానని రాఘువ చెప్పిన రోజు అమ్మ ఆశ్చర్యపోయింది. చెమ్మగిల్లిన కళ్ళను ఒత్తుకుంటూ–

"నేను కష్టపడుతున్నానని అలా అంటున్నావు కదూ?" అంది.

"ఇంకా చదవాలన్న ఆలోచనకే నాకు సిగ్గే స్తోందమ్మా! ఎంత మూర్ఖుణ్ణి నేను. ఈ వయసులో ఇంకా నిన్ను కష్టపెట్టదలుచుకోలే దమ్మా" అమ్మ ఒళ్ళో తల పెట్టుకుని అన్నాడు రాఘువ.

అమ్మ ఎంత చెప్పినా వినకుండా హైదరాబాద్ ప్రయాణమయ్యాడు. ఫలితమే ఈ జర్నలిస్టు ఉద్యోగం. సినిమాల్లో, నవలల్లో చూపించినట్టు హుందాగా వుండే ఉద్యోగమే అయినా సామాన్య జీ(ని)తమే. సగటు మధ్య తరగతి బ్రతుకే. శారీరక, మానసిక శ్రమకోర్చి పని చేసినా సాఫీ జీవితం గడపని జీతం డబ్బుల్తో పట్నం జీవితం చాలా కష్టంగా వుండి, వైవాహిక బంధానికి దూరంగా వుండిపోయాడు. ఎన్ని సార్లు 'నాకు కోడల్ని ఎప్పుడు తెస్తావురా' అని అమ్మ అడిగినా చిరు నవ్వుతో జవాబు దాటేసే వాడే తప్ప, పెళ్ళి ఆలోచన దరి చేరనివ్వలేదు. ఒక్కసారైనా అమ్మను తీసుకొచ్చి మంచి డాక్టర్‌తో చెకప్ చేయించాలని పల్లెకు వచ్చినప్పుడల్లా అనుకు నేవాడు. అమ్మని రమ్మని అన్నప్పుడల్లా 'నా కిప్పుడేమైందిరా? నేను ఆరోగ్యంగానే వున్నానే" కళ్ళ కింద నల్లటి చారికల్ని ముద్దాడుతున్న చెమటని కొంగుతో నొత్తుకుంటూ అనేది అమ్మ.

"నాకో మంచి కోడల్ని తీసుకురారా కన్నా!' అన్న అమ్మ మాటల్ని పట్టించుకున్న రాఘువకు, అంని మనసులోని ఆరాటాన్ని మనస్ఫూర్తిగా పంచుకోవడానికి మరో మనసు దొరికింది. అదే విషయం అమ్మతో చెప్పి, ఆశీర్వచనం తీసుకుని, పెళ్ళికి ముహూర్తం పెట్టించుకోవాలని అమ్మ దగ్గరకు బయల్దేరాడు రాఘువ.



"ఎవరదీ"ఎదురుగా లాంతరు పట్టుకుని వస్తున్న వ్యక్తిని చూసి రాఘవ ఆలోచనలు చెదిరాయి. ఆ మనిషిని ముందుగా రాఘవే గుర్తు పట్టాడు.

"స్వామీ! నేనురా రాఘవని. బాగున్నావా?" అడిగాడు రాఘవ.


"రాఘవా! ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి. నీకోసమే నేను ఎదురు చూస్తున్నా. పద పద త్వరగా" అన్నాడు. వయసు పైబడిన వార్ధక్యపు ఛాయలో ముసలితనం స్వామిలో కొట్టొచ్చినట్టు కనబడుతోంది. స్వామి రాఘవ కంటే వయసులో పెద్దవాడైనా, రాఘవకు ప్రాణ నేస్తం. కార్తీక మాసపు వెన్నెల్లో రాఘవతో పాటే తెల్లార్లూ ఆడుకునేవాడు. అమావాస్య పొద్దుల్లో పొద్దున్నే లేచి కాలువలో చన్నీటి స్నానాలు ఆడేవాడు. రథ సప్తమి జాతరలో కలసి పీచు మిఠాయి తింటూ కాకెంగిలి చేసి ఇచ్చేవాడు. రాఘవ జ్ఞాపకాల్ని ఛేదిస్తూ–

"నీకు కబురంపిందో లేదోనని అందరం ఆదుర్దాపడి పోయాంరా" స్వామి మాటల్లో ఏదో అపశకునం...ఒక సుడిగాలి రాఘవను ఊపేసిన భావం.

"ఏంట్రా? కబురేంటి? అమ్మను చూసి చాలా రోజులైందని నేనే బయల్దేరా" రాఘవ నడుస్తున్న వాడల్లా ఒక్క నిమిషం ఆగాడు. స్వామి మొహం వెలవెలపోయింది. ఏమీ మాట్లాడకుండా రాఘవ భుజంపై చేయి వేసి ఇంటి వరకు తీసుకొచ్చాడు.

ఇంటి వాకిట పలుచగా జనం. అమ్మ దక్షిణం వైపు తల పెట్టుకుని ప్రశాంతంగా నిద్దుర పోతోంది. తలపై దీపం కనీస కాంతి నిస్తోంది. ఏభై ఏళ్ళకే తెచ్చిన ముసలితనం ఆమె ముఖమంతా ఆవరించింది. కనులు మూసుకుని వున్నా, ఆ వృద్ధ ప్రాణిలో కడుపు తీపి కొట్టొచ్చినట్టుగా కనపడుతోంది. పసితనంలో కేవలం రాఘవ అడుగుల సవ్వడిని సందుల్లోంచి విని 'రాక'ను పసిగట్టిన అమ్మ...ఇప్పుడు రాఘవ ఎదురుగా నిల్చున్నా కనులు తెరవటం లేదు. ఏదో అర్ధమై...కానట్టు...భావన...'చావు' వాసన కొట్టే అగరొత్తుల వాసన రాఘవకు 'వాస్తవాన్ని' తెలిపాయి.

"అమ్మా!...మ్మా!" ఆక్రోశం ఆకాశాన్ని తాగింది. ఆవేదన అనంతమైంది. "అమ్మా!" దోసిట్లో మొహం దాచుకుని, అమ్మ కాళ్ళ ముందు కూలబడి పోయాడు రాఘవ. అక్కడున్న వాళ్ళంతా 'అమ్మ' గురించీ, ఆమె




ఎలా బతికిందీ..ఎలా కష్టపడిందీ, మమకారంతో కూడుకున్న మానవ జీవితపు అంతిమ మజిలీ గురించి ఒకరికొకరుగా చెప్పకుంటోన్నారు. ఆ తర్వాత ఏం మాట్లాడాలో తెలియక 'అమ్మ' భౌతిక కాయం వైపు చూస్తూ కూర్చుండిపోయారు. నమ్మలేని చేదు నిజం కళ్ళెదురుగా కట్టెలా కనపడుతుంటే...తట్టుకోలేని రాఘవ మనసు అస్పష్టపు ఆవేదనతో ఉక్కిరి బిక్కిరై పోతోంది. దిక్కులు పిక్కటిల్లే దిగులంతా హృదయాన్ని శ్రావణ మేఘంలా కమ్ముకొని రాఘవతో 'అమ్మ ఇక తిరిగి రాదు' అంటున్నాయి. భుజంపై పడిన చల్లని హస్తం!...స్వామి కళ్ళు సానుభూతిని వర్షిస్తున్నాయి.

'జరగవలసిన తతంగం చూడు" రుద్ధ కంఠంతో స్వామి అన్నాడు.

"స్వామీ! అమ్మను తీసుకెడదామని వచ్చన్రా. పట్నంలో పెద్ద డాక్టరుకు చూపిద్దామనుకున్నారా" పట్టలేని దుఃఖంతో రాఘవ అలమటించి పోతూ అన్నాడు.

"ఇలా అమ్మను ఇట్నుంచిటే పంపిస్తావని అనుకోలేదురా".

"ఊ..రు..కో.. రా..ఘు..వా.." స్వామి మాట్లాడలేకపోతున్నాడు.

*** *** ***

అమ్మ నిశ్శబ్దంగా మట్టిలో కలసి పోయి రెండు రోజులైంది. వరండాలో కుడివైపు మధ్యస్తంగా వేసిన చెక్క ఊయలపై కూర్చుని వున్నాడు రాఘవ.

"రాఘవా!, అమ్మ పొలం అమ్మేసిందిరా. ఇదిగో డెబ్భై వేలు. నీకందజేయమంది. ఇల్లు కూడా అమ్మకానికి పెట్టాము" స్వామి వస్తూ అన్నాడు. ప్రశాంతమైన సరసులో మదపుటేనుగు పిచ్చిగా కలచివేసినట్టు, వృక్షాలు వేళ్ళతో సహా పెకిలించివేసినట్టు కదిలిపోయాడు రాఘవ స్వామి చెప్పిన సంగతి విని.

"రాఘవా! ఈ విషయం నీకు ఎలా చెప్పాలో తెలియడం లేదు. చెప్పకపోతే నేను దోషినవుతా. మనిషి తన జీవితంలో తెలుసుకోవాల్సిన సంగతులు సరిగా తెలుసుకోలేకపోతున్నాడు. అది చాలా జాలి పడాల్సిన విషయం. మీ అమ్మ అంతరంగం గురించి నువ్వు చాలా తక్కువ అంచనా వేశావు. ఏభై ఏళ్ళ పాటు నమ్మకానికి, ఒక అనుబంధానికి అలవాటు పడిన అమ్మకు పట్నంలోని నీ సంగతులన్నీ ఎప్పటికప్పుడు తెలిసి మనస్తాపం చెందేది. ఆ సిటీలో... ఇరుకిరుకు గదుల్లో...చాలీ చాలని జీతం డబ్బుల్తో నువ్వు పడే బాధను విని..తనకొచ్చిన భయంకరమైన జబ్బుని తనలోనే దాచేసుకుంది. అమ్మను రెండేళ్ళుగా పట్టి పీడించింది యుట్రస్ క్యాన్సర్. ఆర్థిక బాధలు ఎక్కువనైన నీతో చెబితే మరిన్ని అప్పులు చేస్తావని...నాతో చెప్పి ఒట్టేయించుకుంది. కడుపులో నొప్పికి ఇక్కడి నాటు మందులే వాడి తాత్కాలికంగా బాధను తగ్గించుకునేది. ఎన్నోసార్లు 'స్వామీ! రాఘవ పెళ్ళి చూడాలని వుందిరా' అనేది. 'ఒరేయ్! నా మనవడికి నా పేరు పెట్టమని చెప్పరా' అంటూ వుండేది. 'స్వామీ! రాఘవను చూడాలని వుందిరా!' అంటే 'పట్నం పోయొస్తమరి పెద్దమ్మా!' అని నేనంటే 'ప్చ్! వద్దులేరా! వాడు మళ్ళీ పరుగెత్తుకుంటూ వస్తాడు. 'ఐదొందలు చార్జీలైపోవూ! ఎందుకురా వాణ్ణి తిప్పలు పెట్టడం' అనేది. ఇంకా నాల్రోజుల్లో పోతుందనగా పొలం అర్జెంటుగా అమ్మేయమంది. 'వాడిక్కడ వుండి పొలం చూసుకోడు. అది అమ్మేస్తే వచ్చిన డబ్బుల్తో వాడు ఓ చిన్న ఇల్లయినా కొనుక్కుంటాడు. పిచ్చి కన్నా! వాడు ఇకపై కష్టపడ కూడదురా' అని అంది, భుజం మీది కండువాతో కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు స్వామి. మాట్లాడ లేదు రాఘవ. గుండెల నిశ్శబ్దాన్ని చెదర్చడం ఇష్టం లేక మాట్లాడ లేదు రాఘవ. రాఘవకు దుఃఖం రావడం లేదు. రెండు బొటన వేళ్ళతో మెదడుని నొక్కిపట్టిన భావన....మనసు నల్లటి గుడ్డలో పెట్టి పిండుతున్నట్టు స్తబ్దత...! గర్భస్థ శిశువు చుట్టూ పేరుకున్న నిశ్శబ్దం తన చుట్టూ కమ్ముకుంటున్నట్టు రాఘవ ఆ నిశ్శబ్దంలో నొదిగిపోయాడు.